క్లుప్తంగా

విద్యార్థులకు నోట్ పుస్తకాల పంపిణీ

ప్రకాశం నగర్ : హిప్నో కమలాకర్ జయంతి సందర్భంగా శనివారం సాయంత్రం స్థబునిక చర్చి పేటలో కారుణ్య చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యక్తిత్వ వికాస పుస్తకాలు, నోట్ బుక్స్, పెన్సిళ్లు, పోషకాహారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ప్రోగ్రెసివ్ సైకాలజిస్ట్ అసోసియేషన్ – ఇండియా అధ్యక్షురాలు డాక్టర్ హిప్నో పద్మా కమలాకర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కమలాకర్ సేవలను కొనియాడారు.

వాడీవేడిగా అసోసియేషన్ మహాజన సభ

కడియం: సర్ ఆర్థర్ కాటన్ నర్సరీ ఫార్మర్స్ అసోసియేషన్ మహాజన సభ శనివారం రాత్రి వాడీవేడిగా జరిగింది. పుల్లా సత్యనారాయణ (చంటియ్య) నేతృత్వంలోని పాలకవర్గం 2016 నుంచి 2023 వరకు జమా ఖర్చుల వివరాలను సభకు వివరించారు. అనంతరం తమ పాలకవర్గం హయాంలో చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను తెలియజేశారు. పలు అంశాలపై చర్చించా రు. సభ్యుల సూచనలు, అభ్యంతరాలను తెలుసుకున్నారు. పాలకవర్గం పదవీకాలం ముగిసినందున స్టీరింగ్ కమిటీకి బాధ్యతలు అప్పగించి, ఎన్నికలు వెళ్లాలని పలువురు సభ్యులు ఈ సందర్భంగా సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై పాలకవర్గ సభ్యులు కూడా తమ సమాధానాలిచ్చారు. 1336 నర్సరీలకు పైగా అసోసియేషన్‌లో సభ్యులుగా ఇప్పటి వరకు నమోదై ఉన్నాయి.

కాలుష్యంపై గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు

ప్రకాశం నగర్: పేపరుమిల్లు కాలుష్యంపై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్‌కు ఫిర్యాదు చేశామని, త్వరలోనే కాలుష్యాన్ని పరిశీలించేందుకు నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ బృందం వస్తుందని కోటిలింగాలపేటకు చెందిన కర్మిక నేత మర్రి పుష్పరాజ్ చెప్పారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఏళ్ల తరబడి పేపరు మిల్లు కాలుష్యం వల్ల కోటిలింగాలపేటలో ఎంతోమంది అనారోగ్యం బారిన పద్దారని, అయినా మిల్లు యాజమాన్యం పట్టించుకోవడంలేదన్నారు. మిల్లు రసాయన వ్యర్థాలు గోదావరిలో కలవడంతో, నది జాలాలు కాలుష్యతమవుతున్నాయని, దీనిని పరిశీలించేందుకు గ్రీన్ ట్రిబ్యునల్ బృందం వస్తున్నట్లు తమకు సమాచారం అందిందని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో నూకథాటి రాజశేఖర్ మర్రి జ్యోతి, సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రేపు కాంగ్రెస్ సత్యాగ్రహ దీక్ష

రాజమహేంద్రవరంసిటీ: కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీపై కుట్రపూరితంగా వ్యవహరించిన బీజేపీ విధానాలను ప్రజలకు తెలియచేసేందుకు సోమవారం బొమ్మూరు కలెక్టరేట్ ఎదుట భారత సత్యాగ్రహ దీక్ష నిర్వహిస్తున్నట్టు నగర కాంగ్రెస్ అధ్యక్షుడు బాలేపల్లి మురళీధర్ ప్రకటించారు. శనివారం కృష్ణ నగర్ కాంగ్రెస్ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ సత్యాగ్రహ దీక్షలో పీసీసీ అధ్యక్షుడు గిడుగు రుద్రరాజు, పీసీసీ వర్కింగ్ అధ్యక్షురాలు సుంకర పద్మశ్రీ పాల్గొంటారని, సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీక్ష జరుగుతుందన్నారు.

వ్యక్తి మృతదేహం లభ్యం

కంబాలచెరువు: స్థానిక పుష్కర్‌ఘాట్ గోదావరి నదిలో వ్యక్తి మృతదేహాన్ని మూడో పట్టణ పోలీసులు శనివారం గుర్తించారు. స్థానికుల సమాచారం తెలపడంతో పోలీసులు ఆ ప్రాంతానికి చేరుకుని గోదావరి నదిలో తేలియున్న మృతదేహాన్ని వెలికితీశారు. అతని శరీరంపై ఎరువు రంగు జాకెట్టు, చీర కట్టుకుని ఉన్నాడు. అతని వయస్సు 40 నుంచి 45 వయస్సు మధ్య ఉంటుందని పోలీసులు తెలిపారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సుర్రుమంటున్న సూరీడు

- 40 డిగ్రీలు దాటుతున్న ఉష్ణోగ్రతలు
- పగలు ఎండ తీవ్రత.. రాత్రి తగ్గుదల
- జిల్లాలో పెరిగిన వేసవితాపం
- ఉక్కబోత, వడదెబ్బ నుంచి జాగ్రత్తలు తప్పనిసరి


నిర్మానుష్యంగా కంబాల చెరువు సెంటర్


కొబ్బరి నీళ్లు తాగుతున్న తండ్రీకూతుళ్లు

రాజమహేంద్రవరం రూరల్/సీటీఆర్ఐ: భానుడు భగ్గుమంటున్నాడు. పగటి పూట తీవ్రమైన ఎండలతో సెగలు కక్కుతున్నాడు. అర్ధరాత్రి నుంచి వేకువజాము వరకు కాస్తంత చల్లటి వాతావరణం ఏర్పడడం కొంతలో కొంత ఉపశమనం కల్పిస్తున్నాడు. గత నాలుగు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. పదిరోజులుగా జిల్లాలో పగటిపూట వేసవితాపం తీవ్రస్థాయికి చేరింది. శుక్రవారం రాజమహేంద్రవరంలో అత్యధికంగా 43డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అయితే గత రెండు రోజులుగా పగటి పూట ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరిగాయి.

నాలుగు మండలాల్లో వడగాల్పులు

జిల్లాలో శనివారం చాగల్లు (41.5), కోరుకొండ(41.4), కొవ్వూరు(35.5), రాజానగరం(35.4) మండలాల్లో వడగాల్పులు వీచాయి. రాజానగరం మండలం నందరాడ గ్రామంలో అత్యధికంగా 42.6 డిగ్రీలు నమోదైంది. జిల్లా వ్యాప్తంగా బిక్కవోలు, చాగల్లు, అనపర్తి, గోకవరం, కోరుకొండ, రాజమహేంద్రవరం అర్బన్, తాళ్లపూడి మండలాల్లో 40 డిగ్రీలకు పైగా ఉష్ణోగ్రత నమోదుకాగా, దేవరపల్లి, గోపాలపురం, కడియం, కొవ్వూరు, నల్లజర్ల, నిడదవోలు, పెరవలి, రాజమహేంద్రవరం రూరల్, రాజానగరం, రంగంపేట, సీతానగరం, ఉండ్రాజవరం మండలాల్లో 30 నుంచి 40 డిగ్రీలు మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. రాబోయే రెండు రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత ఎక్కువగా నమోదయ్యే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ తెలిపింది.

జాగ్రత్తలు తప్పనిసరి

ఈనెల చివరి వారం లేదా మే నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రత 45 డిగ్రీల వరకూ నమోదయ్యే అవకాశం ఉన్నట్టు శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. భానుడి ప్రతాపానికి బెంబేలెత్తే పరిస్థితి ఉంటుందని చెబుతున్నారు. ఉదయం పదింటికే ఫ్యాన్లు, కూలర్లు, ఏసీలు వేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. తాగునీరు, మజ్జిగ, కొబ్బరినీళ్లు, తాటిముంజలు, ఓఆర్ఎస్, ఇతరత్రా పండ్లరసాలు ఎక్కువగా తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరం అయితే తప్ప మధ్యాహ్న సమయంలో బయటకు రాకూడదని చెబుతున్నారు. వదులుగా ఉండే వస్త్రాలు ధరించడం, ఉప్పు, నీరు, పోషక విలువలు కలిగిన ఆహారం తీసుకోవడం, రోజుకు కనీసం 7 నుంచి 8 లీటర్ల నీళ్లు తీసుకుంటే వడదెబ్బబారి నుంచి తప్పించుకోవచ్చని చెబుతున్నారు. పిల్లలు, వృద్ధులు, రోగగ్రస్థులు మరింత జాగ్రత్తలు పాటించాలని హెచ్చరిస్తున్నారు.

ఘనంగా అయ్యప్ప స్వామి పుట్టిన రోజు


అయ్యప్పస్వామి వారిని దర్శించుకుంటున్న రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ప్రకాశం నగర్ : కేరళ విషు పండగ (మలయాళీ ప్రజల ఉగాది) సందర్భంగా శనివారం స్థానిక గౌతమి ఘాట్ సమీపంలో ఉన్న అయ్యప్పస్వామి ఆలయంలో స్వామి వారి పుట్టిన రోజు వేడుకలను ఎంతో వైభవంగా నిర్వహించారు. ఈ వేడుకల్లో వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షులు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. ఎమ్మెల్యే రాజా మాట్లాడుతూ ప్రతి సంవత్సరం కేరళ విషు పండుగ సందర్భంగా ఆలయంలో అయ్యప్ప స్వామి పుట్టినరోజు వేడుకలను ఘనంగా నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందన్నారు. అనంతరం భక్తులకు ప్రసాద వితరణ చేశామన్నారు. ఒక టన్ను వివిధ రకాల కాయగూరలతో అయ్యప్ప స్వామిని అలంకరించారు.

నగరాన్ని సుందరంగా తీర్చి దిద్దుతున్నాం

- ఎంపీ భరత్‌రామ్


జేఎన్ రోడ్డు సెంటర్‌ను పరిశీలిస్తున్న ఎంపీ భరత్‌రామ్

రాజమహేంద్రవరం సిటీ: నగరాన్ని సుందరమైన ప్రాంతంగా తీర్చిదిద్దేందుకు అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నామని ఎంపీ మార్గాని భరత్ రామ్ తెలిపారు. శనివారం నగరంలోని జవహర్ లాల్ నెహ్రూ(జేఎన్) రోడ్డు ఏకేసీ కళాశాల సమీపంలో జంక్షన్ వద్ద ఏర్పాటు చేసిన టీ కేటిల్ సెట్‌ను ఎంపీ భరత్‌రామ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ ఇటువంటి అందమైన ఆకృతులు నగరంలోని పలు ప్రధాన జంక్షన్ల వద్ద మరెన్నో ఏర్పాటు చేయనున్నామన్నారు. ఇప్పటికే పలు చోట్ల అందమైన కళాత్మక విగ్రహాలు ఏర్పాటు చేశామన్నారు. నగరాన్ని శోభాయమానంగా, టూరిజం సిటీగా తీర్చిదిద్దుతున్నామన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే వారికి చక్కని ఆహ్లాదకరమైన వాతావరణం కలిగేలా చేయాలన్నదే తమ లక్ష్యమని ఎంపీ భరత్ అన్నారు. రహదారులను అభివృద్ధి చేస్తూ, ప్రమాదాల నివారణకు డివైడర్లు నిర్మిస్తున్నామన్నారు. ఆ డివైడర్లను కూడా చక్కగా టైల్స్ తోను, కొన్ని చోట్ల రంగులు, వివిధ రకాల మొక్కలతో ఒక గ్రీన్ సిటీని తలపించేలా సుందరీకరిస్తున్నామన్నారు. జేఎన్ రోడ్డు జంక్షన్‌లో ఏర్పాటు చేసిన టీ కేటిల్ సెట్‌తో పాటు దాని చుట్టూ పౌంటైన్, రంగు రంగుల విద్యుద్దీపాలతో ఈ ప్రాంతం అద్భుతంగా కనిపిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరి, నగర యూత్ అధ్యక్షుడు పితా రామకృష్ణ, నక్కా నగేష్ తదితరులు పాల్గొన్నారు.

22న వేంకటేశ్వరుని శాంతి కల్యాణం

కడియం: మురమండలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వరస్వామి వారి విశ్వశాంతి, శాంతి కల్యాణ మహోత్సవం ఈనెల 22వ తేదీన నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు. ఆలయం 9వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని భక్తుల సహకారంతో జరిగే ఈ కార్యక్రమంలో అందరూ పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. బొల్లోజు సూర్యప్రకాశరావు నిర్వహణలో జరుగుతున్న ఈ ఉత్సవాహలను పురస్కరించుకుని శనివారం పందిరి రాట ముహూర్తం చేశారు. గ్రామస్తులు పాల్గొన్నారు.

వెంకన్నకు జన్మనక్షత్ర పూజలు

కడియం: దుళ్ళలోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామివారి జన్మనక్షత్రమైన శ్రవణ నక్షత్రాన్ని పురస్కరించుకుని శనివారం ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు పెద్దింటి లక్ష్మణాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన అభిషేకాలు, పూజలు చేశారు. అధిక సంఖ్య భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

చలివేంద్రం ప్రారంభం

ప్రకాశం నగర్: పాదచారుల దాహం తీర్చేందుకు నగర తెలుకుల, గాండ్ల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం స్థానిక వీఎల్ పురం తెలుకుల వారి చెరువు వద్ద చలివేంద్రం ప్రారంభించారు. తొలి రోజు పులిహోర, ద్రాక్ష రసం పంపిణీ చేశారు. వేసవిలో ముగిసే వరకూ చలివేంద్రాన్ని నిర్వహిస్తామని, ప్రతిరోజు మజ్జిగ పంపిణీ చేస్తామని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం రాష్ట్ర రీజనల్ కోఆర్డినేటర్ నరవ గోపాల కృష్ణ, నగర అధ్యక్షుడు వసాది సత్యనారాయణ, కార్యదర్శి దూది రాము, నాయకులు నరవ అనంత్, అడ్డా వెంకట్రాజు తదితరులు పాల్గొన్నారు.

సీఎం జగన్‌ని విమర్శిస్తే సహించం

సీటీఆర్ఐ: సీఎం జగన్‌ని విమర్శిస్తే సహించేది లేదని, అందుకు తగని సమాధానం చేపుతామని జాతీయ బీసీ సంఘ రాష్ట్ర కనీ్వనర్ అను యాదవ్ హెచ్చరించారు. శనివారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ టీడీపీ నాయకులు నోటికి వచ్చినట్టు మాట్లాడితే అంత కంటే గట్టిగా సమాధానం చేబుతామన్నారు. బీసీ సంఘ నాయకులు కొంత మంది టీడీపీకి తొత్తులుగా మారారన్నారు. బీసీలకు వెన్ను పోటు పొడించింది చంద్రబాబేనన్నారు. బీసీ నాయకుడు ఆర్.కృష్ణయ్యని ఎంపీని చేసింది సీఎం జగన్‌నే అన్న సంగతి మరిచిపోయారాన్నారు. బీసీలకు సముచిత స్థానం కల్పించింది, పదవులు ఇచ్చింది, గౌరవం కల్పించింది సీఎం జగనన్న మాత్రమేనన్నారు.

రచయిత ఆకెళ్ల శివ ప్రసాద్‌కు సత్కారం


ఆకెళ్ల శివప్రసాద్ దంపతులను సత్కరిస్తున్న డైట్ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం

రాజమహేంద్రవరం రూరల్: అమ్మానాన్నలను వృద్ధాప్యంలో ఆప్యాయంగా చూసుకోవాలని, అలాగే మాతృభాషకు ప్రాధాన్యమివ్వాలని రంగమార్తాండ చలన చిత్ర మాటల రచయిత ఆకెళ్ల శివప్రసాద్ అన్నారు. శనివారం బొమ్మూరులోని జిల్లా విద్యాశిక్షణ సంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ ఎస్ఆర్ సుబ్రహ్మణ్యం అధ్యక్షతన 'తెలుగుభాషాసాహిత్యం–రంగమార్తాండుని సంభాషణ చాతుర్యం' అనే అంశంపై సదస్సు నిర్వహించారు. సదస్సుకు ఆకెళ్ల శివప్రసాద్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ప్రిన్సిపాల్ ఎస్.ఆర్.సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో రచయిత ఆకెళ్ల శివప్రసాద్ దంపతులను ఘనంగా సత్కరించారు. అయ్ గోదారోళ్ల మండి పాట రచయిత నూజిళ్ల శ్రీనివాస్, అధ్యాపకులు కె.వి.సూర్యనారాయణ, గంగాధర్, బాలరాజు, వీరభద్రరావు, సత్యనారాయణ, కళావతి, చూడామణి, సుజాతారత్నం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

స్టాంప్‌డ్యూటీ విడుదల చేయాలి

కడియం: గ్రామ పంచాయతీలకు రావాల్సిన స్టాంప్ డ్యూటీ వాటాను విడుదల చేయించాలని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా, ఏపీ స్టేట్ గ్రీనింగ్, బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ చైర్మన్ చందన నాగేశ్వర్‌లను కోరినట్టు వైఎస్సార్ సీపీ కడియం మండల పార్టీ అధ్యక్షుడు, జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్రస్టాలిన్ తెలిపారు. ఈ మేరకు ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 15 నెలలుగా ఈ నిధులు కాలేదన్నారు. సిబ్బంది జీతభత్యాలకు కూడా ఇవ్వలేని స్థితిలో ఉన్నామని, మౌలిక సదుపాయాలు కల్పించలేకపోతున్నామని స్టాలిన్ అన్నారు. సంబంధిత అధికారులతో మాట్లాడి గ్రామ పంచాయతీలను ఆదుకోవాలని కోరినట్టు వివరించారు.

ఆర్బీకేల్లో ధాన్యం కొనుగోళ్లు

కడియం: మండల పరిధిలోని రైతు భరోసా కేంద్రాల(ఆర్బీకే) ద్వారా ప్రభుత్వం ధాన్యం కొనుగోలు చేస్తోందని మండల వ్యవసాయాధికారి కె.ద్వారకాదేవి తెలిపారు. ఈ మేరకు అవసరమైన గన్నీబ్యాగ్‌లు మండలంలోని 8 ఆర్బీకేల పరిధిలోని ప్రాంతాలకు చేరవేశామన్నారు. శనివారం నుంచే ధాన్యం కొనుగోలు ప్రారంభమవుతుందని ఏవో వివరించారు. ప్రభుత్వం నిర్ధారించిన మద్దతు ధర ప్రకారం ఏ గ్రేడ్ రకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2060, కామన్ రకం అయితే రూ.2040 చొప్పున చెల్లించి కొనుగోలు చేస్తామన్నారు. 17శాతం తేమ మించకుండా ఉండాలన్నారు.

కడియం: వేమగిరి ఆర్బీకేను ఎంపీడీఓ కె.రత్నకుమారి శనివారం పరిశీలించారు. ఆ గ్రామంలోని ధాన్యం సేకరణకు సంబంధించి వ్యవసాయ శాఖ సహాయకులను ఆరా తీశారు. వేమగిరిలో 330 ఎకరాలు ఈ క్రాప్ బుకింగ్ జరిగిందని, ఇందుకు సంబంధించి 20,365 సంచులు అవసరం ఉంటాయని తెలిపారు. ఇప్పటి వరకు కడియం నుంచి 400, కోరుకొండ నుంచి 2500 సంచులు రైతు భరోసా కేంద్రానికి చేరినట్లు వారు తెలిపారు. గ్రామ పరిధిలో 1121 రకం వరి సాగు చేసినట్టు ఎంపీడీఓకు వివరించారు. పంచాయతీ కార్యదర్శి కె.రాజశేఖర్, వ్యవసాయశాఖ సిబ్బంది ఉన్నారు.



యుగపురుషుడికి అమృతోత్సవం

నేడు కందుకూరి వీరేశలింగం జయంతి


కందుకూరి వీరేశలింగం స్వగృహం

సీటీఆర్ఐ(రాజమహేంద్రవరం): స్త్రీ విద్య కోసం ఉద్యమించి, పాఠశాలను ప్రారంభించిన స్ఫూర్తి ప్రదాత. బాల్య వివాహాలను రూపు మాపి, వితంతువులకు పునర్వివాహం జరిపించిన యుగపురుషుడు. సమాజ సేవ కోసం హితకారిణి స్థాపించిన సేవామూర్తి. తొలి ప్రదర్శిత నాటకం వ్యవహార ధర్మ బోధినిని సమాజానికి చూపెట్టిన నాటక కర్త. అతనే గోదావరి తీరం రాజమహేంద్రవరంలో నడయాడిన అభినవ నాయకుడు కందుకూరి వీరేశలింగం. ఆయన 1848 ఏప్రిల్ 16న రాజమహేంద్రవరంలో పున్నమ్మ, సుబ్బారాయుడు దంపతులకు జన్మించారు. ఆయన పుట్టిన రోజున అమృతోత్సవం నిర్వహించనున్నారు. కందుకూరి వీరేశలింగం 175వ జయంతిని నిర్వహించేందుకు రాజమహేంద్రవరం ముస్తాబయ్యింది.

నాటక రంగం దినోత్సవంగా ప్రకటన

నాటక రంగం తన ప్రాభావాన్ని కోల్పోకూడదని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి హయాంలో అప్పటి రాజమహేంద్రవరం ఎమ్మెల్యే రౌతు సూర్యప్రకాశరావు అభ్యర్థనపై యుగపురుషుడు కందుకూరి జన్మదినాన్ని నాటకరంగ దినోత్సవంగా ప్రకటించారు.

లక్ష్మిటీమ్‌కు అభినందనలు


సర్వే పూర్తి చేసిన మార్తి లక్ష్మిని అభినందిస్తున్న ఎంపీ మార్గాని భరత్, నగరఅధ్యక్షుడు శ్రీహరి

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్నే మా భవిష్యత్తు కార్యక్రమంలో పీపుల్స్ సర్వే నగరంలోని 13వ వార్డులో పూర్తయింది. ఇంటింటికీ వెళ్లి వైఎస్సార్ సీపీ ప్రభుత్వంపైనా, జగనన్న సంక్షేమ పథకాలు, పాలనపై ప్రజాభిప్రాయ సేకరణ పూర్తి చేసి, ఆ నివేదికను వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్, నగర పార్టీ అధ్యక్షుడు అడపా శ్రీహరికి 13వ వార్డు ఇన్‌చార్జి, నగర మహిళా అధ్యక్షురాలు మార్తి లక్ష్మి అందజేశారు. స్థానిక వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని రాజమండ్రి పార్లమెంటు కార్యాలయంలో ఎంపీ భరత్‌ను కలిసి అభిప్రాయ సేకరణ నివేదికను మార్తి లక్ష్మి అందించారు. ఆ నివేదికను అందుకున్న ఎంపీ భరత్ లక్ష్మిని అభినందించారు. కేవలం నాలుగు రోజుల్లో సర్వే పూర్తి చేసిన గృహ సారథులు, వలంటీర్లు, కన్వీనర్లనూ అభినందించారు. ఇదే స్ఫూర్తి మిగిలిన వార్డులలో కూడా కనిపించాలని ఈ సందర్భంగా ఎంపీ భరత్ తన ఆకాంక్షను వ్యక్తం చేశారు.

ఏ వార్డులోనూ.. ఏ సమస్యా ఉండకూడదు..

రాజమహేంద్రవరం రూరల్: వార్డుల్లో మనం పర్యటించిన తరువాత మార్పు కనబడాలి.. వార్డు ప్రజలు అభివృద్ధి పనులు చూసి అభినందించాలని వైఎస్సార్ సీపీ పార్లమెంటరీ చీఫ్ విప్, రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్ రామ్ అన్నారు. శనివారం నగరంలోని వీఎల్ పురం మార్గాని ఎస్టేట్స్ ప్రాంగణంలోని రాజమండ్రి పార్లమెంటు కార్యాలయంలో స్థానిక 3, 5, 6, 31 వార్డుల ఇన్‌చార్జులు, ఆయా వార్డు వలంటీర్లు, కన్వీనర్లు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఏఈలు తదితరులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీ భరత్ మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వ హయాంలో వార్డుల దుస్థితి ప్రస్తుత మన హయాంలో ఏ విధంగా అభివృద్ధి చేశామో తెలియజేయాలన్నారు. సమస్యలుంటే తన దృష్టికి తీసుకు రావాలని ఎంపీ భరత్ కోరారు. ఈ సమావేశంలో వైఎస్సార్ సీపీ నగర అధ్యక్షుడు అడపా శ్రీహరి, మార్గాని సురేష్, 3వ వార్డు నాయకులు బళ్ళా శ్రీనివాసరావు, నక్కా నగేష్, ఎన్వీ శ్రీనివాస్, 5వ వార్డు ఇన్‌చార్జి కుక్కా తాతబ్బాయి, నాయకులు దూలం ప్రసాద్, పిల్లా వెంకన్న, 6వ వార్డు ఇన్‌చార్జి బురిడి త్రిమూర్తులు, 31వ వార్డు ఇన్‌చార్జి మజ్జి అప్పారావు, ఆర్యాపురం కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ మజ్జి నూకరత్నం, నల్లా రామాంజనేయులు, సచివాలయ సిబ్బంది, మున్సిపల్ ఏఈలు పాల్గొన్నారు.

మీ సమస్యలను సీఎం దృష్టికి తీసుకెళతా

వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి, ఏపీజీ అండ్ బీసీ చైర్మన్ చందన


సదస్సులో మాట్లాడుతున్న జక్కంపూడి విజయలక్ష్మి

రాజమహేంద్రవరం రూరల్: బేడ బుడగ జంగాల సమస్యలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకువెళతానని, వాటి పరిష్కారానికి కృషి చేస్తామని వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి, వైఎస్సార్ సీపీ రూరల్ కోఆర్డినేటర్, ఏపీజీఅండ్ బీసీ చైర్మన్ చందన నాగేశ్వర్ హామీ ఇచ్చారు. శాటిలైట్ సిటీ రామాలయం వద్ద బేడ(బుడ్గ) జంగల హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో శనివారం జరిగిన ఆత్మీయ ఆహ్వాన సదస్సుకు జక్కంపూడి, చందనలు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. రాష్ట్ర సమితి గౌరవాధ్యక్షులు మోటూరి రాము అధ్యక్షతన జరిగిన సదస్సులో రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇంగువ చినసత్యనారాయణ, జిల్లా అధ్యక్షుడు వీర్లపల్లి యేసు తమ సమస్యలను వారిదృష్టికి తీసుకువెళ్లారు. బేడ, జంగాలను ఎస్సీ జాబితాలో చేర్చకపోవడం వల్ల విద్యా ఉద్యోగ రాజకీయ రంగాల్లో అవకాశాలు కోల్పోతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. తమ సమస్యలను పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. దీనిపై స్పందించిన జక్కంపూడి విజయలక్ష్మి, చందన నాగేశ్వర్ మాట్లాడుతూ బేడి బుడగ జంగాల పరిస్థితి అత్యంత దయనీయంగా ఉందనేది వాస్తవమని, వారిని ఎస్సీ జాబితాలో చేర్చేందుకు తమ వంతు ప్రయత్నం చేస్తానని చెప్పారు. జై భీం సేన రాష్ట్ర అధ్యక్షుడు కురువెళ్ల భానుచందర్, రాష్ట్ర ప్రజానాట్య మండలి ఉపాధ్యక్షుడు మహంతి లక్ష్మణరావు, ప్రముఖ కళాకారులు మందపల్లి ప్రేమానందం మాట్లాడారు. ఈ సందర్భంగా బుడగ జంగాల కళాకారులు వివిధ వేషధారణలతో వినూత్న రీతిలో ప్రభుత్వానికి తమ నిరసన తెలిపారు. మాజీ సర్పంచ్ రమణమ్మ, బేడ(బుడ్గ)జంగల హక్కుల పోరాట సమితి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ కోర్టు తొలగించకుంటే ఆందోళనే..

సీటీఆర్ఐ: ఆర్ట్స్ కళాశాల ప్రాంగణంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థుల వసతి గృహాల ఎదుట ఫుడ్ ప్లాజా ఏర్పాటు చేసి విద్యార్థుల చదువుకు తూట్లు పొడుస్తున్నారని దళిత సేన జాతీయ అధ్యక్షుడు జె.బి.రాజు, రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సానబోయిన రామారావు అన్నారు. స్థానిక ప్రెస్ క్లబ్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ బాలికల వసతి గృహాల వద్ద ఫుడ్ కోర్టులు ఏర్పాటు చేయడం మంచి పద్ధతి కాదని, వీటి ద్వారా విద్యార్థుల చదువులకు ఆటంకం కలుగుతోందని విమర్శించారు. ఇక్కడ ఫుడ్ ప్లాజా తొలగించకపోతే ఆందోళన చేపడతామన్నారు. ఒకటి నుంచి ఐదో తరగతి వరకు కామన్ ఎడ్యుకేషన్ విధానం అమలు చేయాలని కోరారు. డీఎస్సీ వెంటనే ప్రకటించి టీచర్ పోస్టులు భర్తీ చేయాలని, గ్రూపు–1, 2 ఉద్యోగ నియామకాలు చేపట్టాలన్నారు. బీసీ ఎస్సీ ఎస్టీ మైనారిటీ సంక్షేమ సంఘం రాష్ట్ర కన్వీనర్ కట్టా మల్లేశ్వరరావు, వైస్ చైర్మన్ ఎల్.వి.ప్రసాద్, జిల్లా అధ్యక్షుడు డి.జార్జి ఆంటోని, బీసీ నాయకులు పాల్గొన్నారు.

